సాక్షి నల్లగొండ

సోమవారం, 26, మే, 2025



మిస్‌వరల్డ్ వేదికపై ఇక్కత్
మిస్ వరల్డ్ పోటీల్లో వివిధ దేశాల సుందరీమణులు పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలతో ర్యాంప్ వాక్ చేసి అలరించారు. - 8లో



కేంద్రం విఫలం
కశ్మీర్‌లో పర్యాటకులకు రక్షణ కల్పించడంలో కేంద్రం విఫలమైందని పీఓడబ్ల్యూ నాయకురాలు సంధ్య విమర్శించారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం 36°/25°

వాతావరణం
మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు పౌరస్పందన వేదిక ప్రచార జాతా

నల్లగొండ : నల్లగొండలో సోమవారం పౌరస్పందన వేదిక ఆధ్వర్యంలో ప్రచార జాతా ప్రారంభం కానున్నట్లు మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆదిఆవరం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ బడులను ప్రజలే కాపాడుకోవాలని పిలుపునిస్తూ ఈ ప్రచార జాతా పట్టణంలోని గడియారం సెంటర్ నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ జాతాకు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా, మండల బాధ్యులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బుద్ధవనం మహాద్భుతం



బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న న్యాయమూర్తి

నాగార్జునసాగర్ : సాగర్‌లో నిర్మాణమైన బుద్ధవనం మహాద్భుతంగా ఉందని జిల్లా అడిషనల్ సెషన్స్ జడ్జి సముద్రాల సంపూర్ణ ఆనంద్ అన్నారు. ఆదివారం ఆయన నాగార్జునసాగర్‌ను కుటుంబ సమేతంగా సందర్శించారు. సాగర్ పర్యటనలో భాగంగా బుద్ధవనం చేరుకున్న న్యాయమూర్తి దంపతులకు బుద్ధవనం ఈఓ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర స్వాగతం పలికారు. మహాస్థూపం ధ్యాన మందిరంలో న్యాయమూర్తి దంపతుల చేత జ్యోతి ప్రజ్వలన చేయించారు. బుద్ధచరితవనం, ధ్యానవనం, స్థూపపార్కు తదితర ప్రాంతాలను సందర్శించారు. పర్యాటక అభివృద్ధి సంస్థ లాంచీలో నాగార్జునకొండకు వెళ్లారు. అక్కడ మ్యూజియాన్ని సందర్శించారు. ఆయన వెంట గైడ్ సత్యనారాయణ, ఎస్ఐ సంపత్, ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, కోర్టు, పోలీస్ సిబ్బంది నరేష్, శివ, కిషన్ ఉన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నల్లగొండ : ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం ఇంటర్ ఫస్టియర్ మ్యాథ్స్, జువాలజీ, హిస్టరీ పరీక్షలు జరిగాయి. మొదటి సంవత్సరం పరీక్షకు 4398 మంది విద్యార్థులకు గాను 4105 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెకండియర్ పరీక్షకు 1,670 మంది హాజరు కావాల్సి ఉండగా 1,590 మంది పరీక్ష రాశారు.

ఉత్తమ సాధన రాష్ట్ర కమిటీకి చందంపల్లి టీచర్



నవీన్‌రెడ్డి

నకిరేకల్ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, అభివృద్ధి, బోధనాంశాల్లో మంచి అనుభవాలను గుర్తించేందుకు విద్యాశాఖ తీసుకున్న బెస్ట్ ప్రాక్టీసెస్ ఆఫ్ స్కూల్స్ (ఉత్తమ సాధన) రాష్ట్రస్థాయి కమిటీకి నకిరేకల్ మండలం చందంపల్లి ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం కనుకుంట్ల నవీన్‌రెడ్డి ఎంపికయ్యారు. కలెక్టర్ చైర్‌పర్సన్‌గా జిల్లా వ్యాప్తంగా 39 మంది ఉపాధ్యాయుల పేర్లను పరిశీలించి వీరిలో ముగ్గురిని ఎంపిక చేశారు. నవీన్‌రెడ్డి చందంపల్లి పాఠశాల బలోపేతానికి చేసిన కృషిని గుర్తించి ఎంపిక చేశారని ఎంఈఓ మేకల నాగయ్య తెలిపారు. నవీన్‌రెడ్డిని డీఈఓ భిక్షపతి, సెక్టోరియల్ ఆఫీసర్ రామచంద్రయ్య అభినందించారు.

కళాశాలల మూసివేత నిర్ణయం సరికాదు

సూర్యాపేట : రాష్ట్ర వ్యాప్తంగా 12 ఎస్సీ గురుకుల జూనియర్ కళాశాలల మూసివేత నిర్ణయం సరికాదని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హసేన్, రాష్ట్ర కార్యదర్శి దాసరి దేవయ్య, జిల్లా అధ్యక్షులు బోయిళ్ల అఖిల్, అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.



పరీక్ష సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్లు

ప్రశాంతంగా జీపీఓ పరీక్ష

నల్లగొండ : నల్లగొండలోని నాగార్జున డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన గ్రామ పాలనాధికారుల (జీపీఓ) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటిండెంట్, ఇన్విజిలేటర్లతో పరీక్ష తీరు తెన్నులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, బందోబస్తు తదితర అంశాలను పరిశీలించారు. గ్రామ పాలనాధికారుల పరీక్షకు 276 మంది హాజరుకావాల్సి ఉండగా 241 మంది హాజరయ్యారు. 35 మంది గైర్హాజరైనట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జి రెవెన్యూ అదనపు కలెక్టర్లు నారాయణ్ అమిత్, రాజ్‌కుమార్, తహసీల్దార్ హరిబాబు ఉన్నారు.

రైతు ప్రయోజనాలే లక్ష్యం

- వారికి ఆర్థికంగా లబ్ధి చేకూర్చేలా ప్రణాళికలు రూపొందించాం
- పెద్ద ఎత్తున రుణ సదుపాయం, జీవన ప్రమాణాలు పెంచేలా నిర్ణయాలు
- ఈ ఆర్థిక సంవత్సరంలో రుణ లక్ష్యం రూ.1100 కోట్లు
- గతేడాది కంటే రూ.483 కోట్ల అదనపు రుణాలు

'సాక్షి' ఇంటర్వ్యూలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి జిల్లాలో రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా బ్యాంకు కార్యకలాపాలను విస్తృతం చేశామని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని సహకార వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు రైతులకు ఆర్థిక సహాయం అందించడం, గ్రామీణ అభివృద్ధిని ప్రోత్సహించే దిశగా చర్యలు చేపడతున్నామని వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో (2025–26) రైతు సంక్షేమ కార్యక్రమాలతోపాటు వారికి బ్యాంకు ద్వారా ఇచ్చే రుణ పరిమితిని పెంచినట్లు వివరించారు. తద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగు పరిచేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. 1917లో ప్రారంభమైన డీసీసీబీ 107 ఏళ్ల పూర్తి చేసుకుందని, ఉమ్మడి జిల్లాలో 108 సహకార సంఘాల ద్వారా రైతులకు వివిధ రకాల సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. బ్యాంకు ఆధ్వర్యంలో గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాలతోపాటు ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే కార్యక్రమాలను 'సాక్షి' ఇంటర్వ్యూలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన వెల్లడించిన అంశాలు ఆయన మాటల్లోనే..

రైతులకు డ్రోన్ల సహకారం

రైతులకు బ్యాంకు సేవలను మరింత విస్తృతం చేయబోతున్నాం. డ్రోన్లను కూడా అందుబాటులోకి తీసుకురాబోతున్నాం. బ్యాంకు పరిధిలోని 108 సహకార సంఘాల్లో డ్రోన్లను అందుబాటులోకి తెస్తాం. వాటిని ఈ వానాకాలం సీజన్‌లోనే అందజేస్తాం. బయటి మార్కెట్ కంటే తక్కువ ఖర్చుతో రైతులు వరి, పత్తి చేలకు పురుగు మందులను పిచికారి చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

మరో 6 కొత్త శాఖలు

ఉమ్మడి జిల్లాలోని తిప్పర్తి, ఆత్మకూర్, గరిడేపల్లి, నారాయణపూర్, దామరచర్లలో కొత్త శాఖల ఏర్పాటుకు ఇప్పటికే ఆర్‌బీఐ అనుమతి ఇచ్చింది. వాటిని త్వరలో ప్రారంభిస్తాం. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 6 కొత్త శాఖల ఏర్పాటుకు ఆర్‌బీఐకి ప్రతిపాదనలను పంపించాం. మిర్యాలగూడ, శాలిగౌరారం, పెద్దవూర, మోతె, చిలుకూరు, నాంపల్లిలో వాటిని ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం.

గతంలో కంటే రుణ లక్ష్యం పెంపు

బ్యాంకు ద్వారా రైతులకు వ్యవసాయ రుణాలతోపాటు వ్యవసాయేతర, దీర్ఘకాలిక రుణాలను కూడా ఇస్తున్నాం. గతంలో కంటే ఈసారి రుణాల లక్ష్యాన్ని పెంచాం. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.483 కోట్లు అదనంగా ఇవ్వబోతున్నాం. 2023–24లో బ్యాంకు ద్వారా అన్ని రకాల రుణాలు రూ.344 కోట్లు ఇవ్వగా, 2024–25లో రూ.783 కోట్లు ఇచ్చాం. అందులో వ్యవసాయ రుణాలు రూ.100 కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రూ.181 కోట్లు, వ్యవసాయేతర రుణాలు రూ.206 కోట్లు, బంగారు ఆభరణాలపై రూ.296 కోట్ల రుణాలను ఇచ్చాం. ఇక ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1100 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందులో అన్ని రకాల రుణాలను గతంలో కంటే పెంచాం. వ్యవసాయ రుణాలను రూ.150 కోట్లు, దీర్ఘకాలిక రుణాలను రూ.250 కోట్లకు, వ్యవసాయేతర రుణాలను రూ.300 కోట్లకు, బంగారు ఆభరణాలపై రుణాలను రూ.400 కోట్లకు పెంచాం. గతంలో కొత్త సభ్యులకు స్వల్పకాలిక పంట రుణాలను రూ.40 కోట్ల వరకే ఇచ్చే వారు. దానిని గతేడాది రూ.100 కోట్లకు పెంచాం. ఈసారి మరింత పెంచుతాం.

వ్యక్తిగత, హౌసింగ్, వ్యాపార రుణాలు..

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు గతంలో హౌసింగ్ లోన్లు ఇవ్వలేదు. మా పాలకవర్గం బాధ్యతలు చేపట్టాకే గృహ నిర్మాణ రుణాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాం. గరిష్టంగా రూ.35 లక్షల వరకు హౌసింగ్ లోన్ ఇస్తాం. ప్రభుత్వ ఉద్యోగులకు రూ.5 లక్షల వరకు వ్యక్తిగత, వ్యాపార రుణాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాం. అలాగే ఫిష్, డెయిరీ, పౌల్ట్రీ తదితర రంగాలకు 35 శాతం సబ్సిడీతో రుణాలను ఇస్తాం. గొర్రెలు, నాటుకోళ్ల పెంపకానికి రుణ సదుపాయం కల్పిస్తున్నాం. కేంద్రం ప్రవేశపెట్టిన ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా తమ బ్రాంచీల పరిధిలో అక్షరాస్యత కేంద్రాలను ఏర్పాటు చేశాం. వాటిల్లో ప్రజలకు ఆర్థిక పరమైన అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది మార్చి 31వ తేదీవరకు 310 గ్రామాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించాం.

జూన్‌లోనే మూడు నెలల రేషన్

జూన్, జూలై, ఆగస్టు మాసాల కోటా బియ్యం పంపిణీ

- వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్రం ఆదేశం
- ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు బియ్యం సరఫరా



నల్లగొండ : రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం ఒకే సారి మూడు నెలల బియ్యం ఇవ్వాలని నిర్ణయించింది. వచ్చే వర్షాకాలంలో వర్షాలు, వరదలకు బియ్యం రవాణా, సరఫరాలో ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉండడంతో జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యం కోటాను జూన్ మాసంలోనే పేదలకు పంపిణీ చేయనుంది. అందులో భాగంగా అధికారులు రేషన్ షాపులకు బియ్యం రవాణాను ప్రారంభించారు.

నెలకు 9 వేల మెట్రిక్ టన్నులు..

జిల్లాలో మొత్తం 4,84,216 మంది రేషన్‌కార్డుదారులు ఉండగా అందులో 15,02,656 మంది సభ్యులు ఉన్నారు. వారందరికి నెలకు 9 వేల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం ఉంటుంది. మూడు నెలలక సంబంధించి 27 వేల పైచిలుకు మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం ఉంది. ఈ బియ్యం ఈ నెల 30లోగా రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేయాల్సి ఉంది. అయితే రేషన్ షాపుల్లో కొన్నిచోట్ల మూడు బియ్యం నిల్వ చేయడానికి స్థలం లేనందున విడతల వారీగా సరఫరాను చేయాలని నిర్ణయించారు. మొదట ఒక లారీ, వారం రోజుల తర్వాత మరో లారీ, మరో వారం తర్వాత లారీ.. ఇలా మూడు విడతలుగా షాపులకు ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి బియ్యం రవాణా అవుతాయి.

జూన్ 1 నుంచి 30 వరకు పంపిణీ

ప్రభుత్వం ఇచ్చే సన్న బియ్యాన్ని మూడు మాసాలకు సంబంధించిన కోటాను జూన్ మాసంలో పంపిణీ చేయనున్నారు. రేషన్ డీలర్లు జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయాలని ఆదేశాలు అందాయి. ఇందులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

బియ్యం రవాణా ప్రారంభించాం



రేషన్ కార్డుదారులకు ఒకే సారి మూడు మాసాలకు సంబంధించిన బియ్యం కోటాను అందించాలని ఆదేశాలు వచ్చాయి. ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు రవాణా ప్రారంభించాం. జూన్ 1 నుంచి బియ్యం పంపిణీ ప్రారంభమవుతుంది. ఏ ఒక్క కార్డుదారుడు ఇబ్బంది పడకుండా డీలర్లు బియ్యం పంపిణీ చేస్తారు. రవాణాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకున్నాం.
– హరీష్, డీఎం పౌర సరఫరాల శాఖ, నల్లగొండ

దేవరకొండలో తిరంగా ర్యాలీ



దేవరకొండలో తిరంగా ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

దేవరకొండ : పహల్గాంలో ఉగ్రవాదుల దాడికి ప్రతిగా భారత సైన్యం పాకిస్తాన్‌పై చేసిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా ఆదివారం దేవరకొండ పట్టణంలో తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపం నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, లాలునాయక్, ఏటి కృష్ణ, కల్యాణ్‌నాయక్, రవికుమార్, సురేష్, వస్కుల సుధాకర్, పున్న వెంకటేష్, నక్క వెంకటేష్, ఎన్‌వీటీ, శివగౌడ్, గణేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పేరుతో ఒక మొక్క!

- వన మహోత్సవంలో మహిళా సంఘాల భాగస్వామ్యం
- మొక్క నాటి సంరక్షించే బాధ్యత మహిళలకు అప్పగింత
- మిర్యాలగూడ మున్సిపాలిటీలో వినూత్న కార్యక్రమం



యాద్గార్‌పల్లి చెరువు వద్ద మహిళా సంఘాలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ యూసుఫ్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు మహిళా సంఘాల భాగస్వామ్యంతో చర్యలు చేపట్టింది. ఈ ఏడాది వన మహోత్సవంలో భాగంగా ఉమెన్స్ ఫర్ ట్రీస్ పేరుతో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చింది. అమృత్ 2.0 స్కీం కింద 'ఏక్ పేడ్ మా కే నామ్' (అమ్మ పేరుతో ఒక మొక్క) అనే నినాదంతో మహిళా సంఘాల సభ్యులు మొక్కను నాటడంతో పాటు రెండేళ్ల పాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత కూడా వారే చూసేలా కార్యాచరణ రూపొందించింది.

రెండు ప్రాంతాలు గుర్తింపు..

'అమ్మ పేరుతో ఒక మొక్క' అనే నినాదంతో చేపట్టిన వన మహోత్సవం విజయవంతానికి మున్సిపల్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రధానంగా చెరువుల సమీపాల్లో మొక్కలను నాటనున్నందున పట్టణానికి అనువైన స్థలాలుగా యాద్గార్‌పల్లి పందిర్లపల్లి చెరువు(బోటింగ్ పార్క్), హౌజింగ్ బోర్డు చిన్న చెరువులను గుర్తించారు. చెరువుల వద్ద మొక్కలను నాటి సంరక్షించే బాధ్యతను మహిళా సమాఖ్యలకు అప్పగిస్తారు.

జూన్ 5వ తేదీ నుంచి ప్రారంభం..

మున్సిపాలిటీలో గుర్తించిన రెండు ప్రాంతాల్లో జూన్ 5వ తేదీ నుంచి మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం ఆగస్టు 31వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ సమయంలో ఆయా ప్రాంతాల్లో మహిళా సంఘాల సభ్యులు మొక్కలు నాటనున్నారు.

ఉద్యమంలా మొక్కలు నాటే కార్యక్రమం

మున్సిపాలిటీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ మహిళా సంఘాలకు సూచిస్తున్నారు. మున్సిపాలిటీలో మొక్కలను నాటేందుకు గుర్తించిన స్థలాల్లో మహిళలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

సుందరీకరణ పనుల పరిశీలన

తిప్పర్తి : తిప్పర్తి మండల కేంద్రంలో జరుగుతున్న సుందరీకరణ పనులను రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రాన్ని సుందరీకరణ చేయడానికి రూ.9 కోట్లతో పనులు చేపట్టామన్నారు. మండల కేంద్రాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఆయన వెంట నాయకులు జూకూరి రమేష్, పాశం సంపత్‌రెడ్డి, బద్దం సుధీర్, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, పల్లె ఎల్లయ్య, గుండా సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



గిరిజనులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్

హాలియా : గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం(టీఆర్‌జీఎస్) ఆధ్వర్యంలో పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో నిర్వహించిన విద్యా, వైజ్ఞానిక రాజకీయ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల్లో ఆదివారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి తీసుకొచ్చి గిరిజన రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతోందన్నారు. అందులో భాగంగా తిరుమలగిరి(సాగర్) మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఫారెస్టు భూములకు పట్టాలు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతుల భూ సమస్యలను పరిష్కరిస్తుందని గుర్తు చేశారు. గిరిజనులను ఐక్యమత్యంతో గిరిజన నాయకులు ముందుకు నడిపించి హక్కుల సాధన కోసం పోరాడాలన్నారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి మాట్లాడుతూ గిరిజనులకు 10శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, తండాలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా గుర్తించాలనే న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. టీఆర్‌జీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర శంకర్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గిరిజన సంఘం సీనియర్ నాయకులు రమావత్ శంకర్‌నాయక్, బుడియాబాబు పీఠాధిపతి అంగోతు భగవాన్‌నాయక్, టీఆర్‌జీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ధీరావత్ రవినాయక్, రిటైర్డ్ డీటీడీఓ లాల్ సింగ్, రమావత్ లలితాబాయి, రమావత్ జవహర్ నాయక్, వెంకన్న, చంద్రుడునాయక్, రాగ్యానాయక్, నరేష్‌నాయక్, శ్రీనునాయక్, సురేష్, భాస్కర్ నాయక్, అశోక్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్‌లో డీలక్స్ బస్‌స్టాప్ ఎత్తివేత

- నాన్ స్టాప్‌గా సూర్యాపేట– నల్లగొండ డీలక్స్ సర్వీస్
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



ప్రధాన సెంటర్‌లో ఆగిన డీలక్స్ బస్(ఫైల్)

నకిరేకల్ : మున్సిపాలిటీ, నియోజకవర్గ కేంద్రమైన నకిరేకల్‌లో ఆర్టీసీ డీలక్స్ బస్‌స్టాప్‌ను ఎత్తివేసింది. ఇప్పటి వరకు సూర్యాపేట నుంచి నకిరేకల్, తాటికల్ మీదుగా నల్లగొండకు డీలక్స్ బస్సులు నడిపింది. రోజూ 20 ట్రిప్పులు నడిచేవి. ఈ డీలక్స్ బస్సులతో నకిరేకల్ ప్రాంత ప్రయాణికులు నల్లగొండ, సూర్యాపేట వెళ్లేందుకు సౌకర్యంగా ఉండేది. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్‌ల్లో మహాలక్ష్మి పథకం అమలుతో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది. దీంతో చాలా మంది డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే వారు. ఇటీవల ఆ డీలక్స్ బస్సుల స్టాప్‌ను నకిరేకల్‌లో ఎత్తివేసి.. వాటిని నాన్‌స్టాప్ సర్వీసులుగా మార్చారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపార కేంద్రంగా ఉన్న నకిరేకల్‌లో డీలక్స్ బస్‌స్టాప్‌ను పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈవిషయంపై నకిరేకల్ ఆర్టీసీ బస్టాండ్ కంట్రోలర్ పల్స వీరయ్యను వివరణ కోరగా.. నకిరేకల్‌లో డీలక్స్ బస్‌స్టాప్ పునరుద్ధరించే విషయాన్ని ఆర్టీసీ డీఎం దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు.

స్టాప్‌ను పునరుద్ధరించాలి



కొంతకాలంగా నకిరేకల్ స్టాప్‌గా సూర్యాపేట – నల్లగొండకు వయా తాటికల్ మీదుగా ఆర్టీసీ డీలక్స్ బస్సులు నడిపింది. కొన్ని రోజుల నుంచి నకిరేకల్ స్టాప్‌ను ఎత్తివేసి నాన్‌స్టాప్ సర్వీస్‌గా మార్చారు. ప్రభుత్వ ఉద్యోగులు నిత్యం నల్లగొండ – నకిరేకల్ – సూర్యాపేటకు రాకపోకలు సాగిస్తుంటారు. మహాలక్ష్మి పథకంతో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. ఉద్యోగులు చాలా మంది డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే వారు. నకిరేకల్‌లో స్టాప్ ఎత్తివేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నకిరేకల్‌లో స్టాప్‌ను పునరుద్ధరించాలని నల్లగొండ, సూర్యాపేట ఆర్టీసీ డీఎంలకు విన్నవించాం.
– బెల్లి యాదయ్య, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, నకిరేకల్

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

సూర్యాపేట అర్బన్ : కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ, ప్రధాన కార్యదర్శి అనిల్ సాయిబోలా డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను ఖండిస్తూ ఆదివారం సూర్యాపేటలోని కొత్త బస్టాండ్ వద్ద నల్ల జెండాలు, ప్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. అటవీ సంపదను కార్పొరేట్ పెట్టుబడిదారుల హస్తగతం కాకుండా రక్షిస్తున్న మావోయిస్టులను అంతమొందించాలని చూడడం దుర్మార్గపు చర్య అని విమర్శించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టులపై బూటకపు ఎన్‌కౌంటర్లు, ఆదివాసీలపై జరుపుతున్న సామూహిక హత్యాకాండపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని సమగ్ర విచారణ జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.నరసింహారావు, నరేందర్, ఎర్ర అఖిల్ కుమార్, గణేష్, సురేష్, వెంకటేష్, రాకేష్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేటలో కొత్త బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన సంగపాక నరేష్(30) ఇటీవల బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తుండగా.. భువనగిరి సమీపంలోని ఎల్లమ్మ గుడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించగా.. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కారు ఢీకొని..

భువనగిరి: హైదరాబాద్‌కు చెందిన సంగపాక నవీన్(31) ఈ నెల 15న భువనగిరిలోని తన స్నేహితుడి జన్మదిన వేడుకలకు హాజరయ్యేందుకు బైక్‌పై వచ్చాడు. వేడుకల అనంతరం తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండగా.. భువనగిరి మండలం అనంతారం గ్రామ పరిధిలో గల ప్లై ఓవర్‌పై కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నవీన్‌ను స్థానికులు భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి, అక్కడి నుంచి మరో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం నిమ్స్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. మృతుడి బంధువు బట్టు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు..


సత్తయ్య (ఫైల్)

చౌటుప్పల్: ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగడపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు చెరుకు సత్తయ్య(54) రోజువారి మాదిరిగానే ఆదివారం ఉదయం సైతం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కి దిగుతుండగా మోకు జారడంతో జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని పొలాల వద్ద ఉన్న వ్యక్తులు చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి సత్తయ్య మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

పిడుగుపాటుతో ఏడు మేకపోతులు మృతి


మృతిచెందిన మేకపోతులు

మేళ్లచెరువు: మేళ్లచెరువు మండలంలోని కందిబండ గ్రామ శివారులో ఆదివారం పిడుగు పడి ఏడు మేకపోతులు మృతిచెందాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెరువు మండల కేంద్రానికి చెందిన సుంకర బోయిన చినసైదులు ఆదివారం తన గొర్రెలతో పాటు వేరే వారికి చెందిన మేకపోతులను మేపుకుంటూ కందిబండ గ్రామ శివారులోకి వెళ్లాడు. మధ్యాహ్నం 3గంటల సమయంలో వర్షం రావడంతో మేకపోతులు స్థానిక పొలాల్లోని తాటిచెట్ల కిందకు వెళ్లాయి. ఈ సమయంలో ఓ తాటిచెట్టుపై పిడుగుపడడంతో దాని కింద ఉన్న ఏడు మేకపోతులు మృతిచెందాయి. హనుమంతుకు చెందిన 2 మేకపోతులు, పోశం అచ్చిరెడ్డికి చెందిన ఒకటి, సుంకరబోయిన చినసైదులుకు చెందిన 4 మేకపోతులు మృతిచెందాయి. వాటి విలువ సుమారు రూ.2లక్షలకు పైగా ఉంటుందని ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

మిస్ వరల్డ్ వేదికపై పోచంపల్లి ఇక్కత్

- ఇక్కత్ వస్త్రాలు ధరించి ర్యాంప్ వాక్ చేసిన అందాల భామలు
- అంతర్జాతీయంగా పోచంపల్లికి గుర్తింపు వచ్చిందంటున్న చేనేత కళాకారులు


పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను ధరించి ర్యాంప్ వాక్ చేస్తున్న అందాల భామలు


మిస్ వరల్డ్ ఫ్యాషన్ షోలో పోచంపల్లి ఇక్కత్ గాగ్రా ధరించిన మిస్ ఇండియా నందిని గుప్తా

భూదాన్‌పోచంపల్లి: మిస్ వరల్డ్ వేదికపై పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు మరోసారి తళుక్కుమన్నాయి. శనివారం హైదరాబాద్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో జరిగిన వరల్డ్ ఫ్యాషన్ ఫినాలేలో అమెరికా, కరేబియన్ దేశాలకు చెందిన అందాల భామలు పోచంపల్లి ఇక్కత్‌తో పాటు గద్వాల్, గొల్లభామ చేనేత వస్త్రాలతో రూపొందించిన అధునాతన ఫ్యాషన్ వస్త్రాలను ధరించి ర్యాంప్ వాక్ చేసి అలరించారు. మన సంస్కృతి ఉట్టిపడేలా నూతన డిజైన్లతో ముంబైకి చెందిన ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ అర్చనా కొచ్చర్ ఇండో వెస్టన్ కలగలిపి ఫ్యాషన్ వస్త్రాలను రూపొందించారు. రెండు రౌండ్‌లలో జరిగిన మిస్ వరల్డ్ టాప్ మోడల్ ఫ్యాషన్ షోలో 108 మంది అందాల భామలు పాల్గొన్నారు. మొదటి రౌండ్‌లో మిస్ వరల్డ్ పోటీదారులు ర్యాంప్ వాక్ చేసి పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలతో మెరిశారు. మిస్ ఇండియా నందిని గుప్తా ఎరుపురంగు గాగ్రా వస్త్రాలతో తళుక్కుమన్నారు. యూరప్ ఖండానికి చెందిన వివిధ దేశాల భామలు గొల్లభామ చేనేత చీరలు ధరించి మెప్పించారు. కాగా ఫ్యాషన్ ఫినాలే న్యాయనిర్ణేతలు సైతం తెలంగాణ సంప్రదాయ వస్త్రాల డిజైన్లు చూసి ప్రశంసలు కురిపించారు. తెలంగాణ చేనేత వస్త్రాల ద్వారానే ఏషియా–ఓషియానా విభాగంలో మన మిస్ఇండియా నందిని గుప్తా టాప్ మోడల్ ఫైనల్ టైటిల్‌ను సాధించడం విశేషం. మిస్ వరల్డ్ పోటీల వేదిక ద్వారా చేనేత వస్త్రాలకు ప్రచారం పెరిగి మార్కెటింగ్ అవకాశాలు, ఆదరణ పెరిగే అవకాశం ఉందని చేనేత వర్గాలు పేర్కొంటున్నారు. అంతేకాకుండా ఈ నెల 15న పోచంపల్లిలోని టూరిజం పార్కులోని హంపి థియేటర్‌లో నిర్వహించిన ఇక్కత్ ర్యాంప్ వాక్‌కు మిస్ వరల్డ్ పోటీదారులు తిలకించడం ద్వారా అంతర్జాతీయంగా మంచి గుర్తింపు వచ్చింది. మిస్ వరల్డ్ పోటీదారులు చేనేత వస్త్రాలనే ధరించి తెలంగాణలోని ప్రముఖ దేవాలయాలు, చారిత్రక ప్రదేశాలను సందర్శించారు. దీంతో కూడా చేనేత వస్త్రాలకు తగిన ప్రాచుర్యం లభించింది.

గురుకులాలు పేద విద్యార్థులకు వరం

- రెడ్‌క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి


విద్యార్థులను సన్మానిస్తున్న నిర్వాహకులు

మోత్కూరు: పేద విద్యార్థులకు గురుకులాలు వరంలాంటివని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా చైర్మన్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. గురుకులాల్లో చదివిన మలావత్ పూర్ణ, సాధనాల ఆనంద్ 2014 మే 25న ఎవరెస్ట్ శిఖరం ఎక్కి ప్రపంచ రికార్డు సృష్టించడంతో ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా స్వేరో నెట్‌వర్క్ ఆధ్వర్యంలో మోత్కూరు జెడ్పీహెచ్ఎస్‌లో విక్టరీ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని జెడ్పీహెచ్ఎస్‌లు, మోడల్ స్కూళ్లు, గురుకులాల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ చదివి ప్రథమ, ద్వితీయ ర్యాంకులు పొందిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ మందుల నర్సయ్య పంపించిన ఇంగ్లిష్ డిక్షనరీలను సన్మానం పొందిన విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గురుకులాల కార్యదర్శిగా పనిచేసిన సమయంలో గురుకులాలను ఎంతో అభివృద్ధి చేశారని, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఇచ్చారని పేర్కొన్నారు. స్వేరో నెట్‌వర్క్ జిల్లా కమిటీ అధ్యక్షుడు ఎర్రవెల్లి నర్సయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ అన్నెపు వెంకట్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు తొర్ర ఉప్పలయ్య, కనుకు రాజు, గజ్జెల్లి మహేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీలతో విద్యార్థుల్లో మేధోశక్తి పెరుగుతుంది


గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న గండూరి కృపాకర్

సూర్యాపేట: చెస్ పోటీలతో విద్యార్థుల్లో మేధోశక్తి పెంపొందుతుందని సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి కృపాకర్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి జిల్లా స్థాయిలో బాలబాలికలకు(అండర్–11, 17 విభాగాల్లో) చెస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి షీల్డ్‌లు, మెమెంటోలను గండూరి కృపాకర్ అందజేసి మాట్లాడారు. గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీసాయికుమార్, సంయుక్త కార్యదర్శి గడ్డం లింగారెడ్డి, కోశాధికారి వెంకట మురళి, బాణాల వెంకటేశ్వర్లు, మాద రమేష్, ఎస్. మురళి, భిక్షం, సందీప్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ అధ్యాపకుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాలల అధ్యాపకులు

కోదాడ: కోదాడ పట్టణంలోని వివిధ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 1988–2025 వరకు పనిచేసిన ప్రైవేట్ అధ్యాపకుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కోదాడ సమీపంలోని కొమరబండ వై జంక్షన్ వద్ద నిర్వహించారు. గడిచిన 35 సంవత్సరాలుగా పనిచేస్తున్నవారు, ఇతర వృత్తుల్లోకి మారిన అధ్యాపకులు ఒక్కచోట చేరి తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌కే చాంద్‌పాషా, బూర సైదయ్య గౌడ్, మారం వెంకటరెడ్డి, సుధాకర్‌రెడ్డి, చందా శ్రీనివాసరావు, రామనర్సయ్య, సనత్‌కుమార్, నర్సిరెడ్డి, నరేందర్, బడుగుల సైదులు, శేకు రమేష్, నరసింహారావు, వెంకటేశ్వరరెడ్డి, వెంకన్న, దొడ్డా శ్రీధర్, బిక్షాచారి, సనత్‌కుమార్, శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణప్రసాద్, ఉపేందర్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మూసీ నదికి పెరిగిన వరద

అర్వపల్లి: హైదరాబాద్‌తో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు జాజిరెడ్డిగూడెం శివారులోని మూసీ నదికి వరద పెరిగింది. దీంతో మూసీ నది నీటితో కళకళలాడుతోంది. మూసీ పరీవాహక గ్రామాల్లోని వ్యవసాయ బోర్లలో నీళ్లు పెరగడంతో వానాకాలం సీజన్‌కు సాగునీటి కొరత తీరనుంది.


జాజిరెడ్డిగూడెం శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ నది

యాదగిరిగుట్ట ఆలయంలో భక్తుల రద్దీ


ఆలయ పరిసరాల్లో కిటకిటలాడుతున్న భక్తులు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ పరిసరాలు, మాడ వీధులు, క్యూలైన్‌లు, ప్రసాదం, విక్రయశాల, కల్యాణ కట్ట, లక్ష్మీపుష్కరిణి ప్రాంతాల్లో భక్తులు అధికంగా కనిపించారు. ధర్మదర్శనానికి రెండున్నర గంటలు, వీఐపీ దర్శనానికి 30 నిమిషాలు పట్టిందని భక్తులు తెలిపారు. ఉదయం సాయంత్రం బ్రేక్ దర్శనాల సమయంలో మధ్యాహ్నం ఆరగింపు సమయంలో క్యూలైన్లలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్వామివారిని 30వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. స్వామివారికి నిత్యాదాయం రూ.74,33,486 సమకూరిందని ఆలయ అధికారులు వెల్లడించారు.

సంప్రదాయరీతిలో నిత్య పూజలు

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం నిత్య పూజలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు స్వయంభూలకు సుప్రభాత సేవ చేపట్టారు. స్వామి, అమ్మవార్లకు ఆరాధన, నిజాభిషేకం, అర్చన చేశారు. ఆలయ ముఖ మండపాల్లో సువర్ణ పుష్పార్చన అష్టోత్తరం, ప్రాకార మండపంలో శ్రీ సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, వేద ఆశీర్వచనం, తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు జోడు సేవలను ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని తమ మొక్కులను చెల్లించుకున్నారు. రాత్రి శయనోత్సవం జరిపించి, ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

స్వర్ణగిరీశుడికి సహస్ర దీపాలంకరణ సేవ

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో వేంకటేశ్వరస్వామికి ఆదివారం సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన సేవ, నిత్య కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం సుమారు 4500 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కన్నెకంటికి లీడర్ అవార్డుతో సన్మానం


వెంకటేశ్వరాచారిని సన్మానిస్తున్న విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ప్రతినిధులు

రామన్నపేట: రామన్నపేట మండలం మునిపంపుల మాజీ ఎంపీటీసీ సభ్యుడు, సింగిల్ విండో డైరెక్టర్ కన్నెకంటి వెంకటేశ్వరాచారిని హైదరాబాద్‌లోని విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వారు లీడర్ అవార్డుతో సన్మానించారు. ఆదివారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో గల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయనను సన్మానించారు. రాజకీయాల్లో విశ్వకర్మల భాగస్వామ్యం పెంపొందించడమే లక్ష్యంగా 14 రాష్ట్రాలకు చెందిన 410మంది విశ్వకర్మ ప్రతినిధులను సన్మానించినట్లు వెంకటేశ్వరాచారి తెలిపారు.

కొంపల్లి గ్రామానికి వచ్చిన సీఎం సతీమణి

- సమీప బంధువు దశదినకర్మలో పాల్గొన్న గీత


మధుసూదన్‌రెడ్డి దశదినకర్మకు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీత

మునుగోడు: మునుగోడు మండలంలోని కొంపల్లి గ్రామానికి ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీత వచ్చారు. తమ సమీప బంధువు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెదిర మధుసూదన్‌రెడ్డి దశదినకర్మకు సీఎం సతీమణి గీత, ఆమె తల్లిదండ్రులు సూదిని పద్మారెడ్డి, పారిజాత హాజరై మధుసూదన్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారితో పాటు రాష్ట్ర లోకాయుక్త చైర్మన్ జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్‌నేత, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చలమల్ల కృష్ణారెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు హాజరై మధుసూదన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.

పర్యాటకులకు రక్షణ కల్పించడంలో కేంద్రం విఫలం

- మావోయిస్టు పార్టీలతో చర్చలు జరపాలి
- పీఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు సంధ్య


మాట్లాడుతున్న పీఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు సంధ్య

ఆలేరు: కశ్మీర్‌లో పర్యాటకులకు రక్షణ కల్పించడంలో కేంద్ర ప్రభుత్వ పూర్తిగా వైఫల్యం చెందిందని ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) జాతీయ నాయకురాలు వి. సంధ్య ఆరోపించారు. పహల్గాం ఘటన, ఆపరేషన్ సిందూర్‌లో దాగిన నిజాలు, ఆపరేషన్ కగార్‌ను ఆపాలనే అంశాలపై ఆదివారం ఆలేరు పట్టణంలో జరిగిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. పహల్గాంలో పర్యాటకులను చంపిన ఉగ్రవాదులు దేశం దాటి వెళ్తుంటే రక్షణ శాఖ ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఆపరేషన్ సింధూర్ వల్ల పాలకవర్గాలకు ప్రయోజనం తప్ప.. ప్రజలకు, భారత్, పాకిస్తాన్ దేశాలకు ఏమీ లాభం లేదన్నారు. మనకంటే ముందే ఆపరేషన్ సింధూర్ ఆగిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం మన దేశ ఆత్మగౌరవాన్ని అమెరికా ముందు తాకట్టు పెట్టడం కాదా అని ప్రశ్నించారు. ఉగ్రవాదంపై ప్రధాని నరేంద్ర మోదీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని అన్నారు. చర్చలకు సిద్ధమని ప్రకటించిన మావోయిస్టు పార్టీలతో చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. మావోయిస్టుల పేరుతో గిరిజనులు, ఆదివాసులను చంపడాన్ని ఆపాలన్నారు. మోదీ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు సిద్ధం కావాలని సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి, సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి ఆర్. జనార్దన్, సీపీఐ జిల్లా కార్యదర్శులు గోద శ్రీరాములు, జహంగీర్, జిల్లా నాయకులు మామిడాల సోమయ్య, ఆర్. సీత తదితరులు పాల్గొన్నారు.

చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు

- నిబంధనలకు విరుద్ధంగా ఎఫ్‌టీఎల్ పూడ్చివేత
- ఆందోళన వ్యక్తం చేస్తున్న మత్స్యకారులు


హనుమాండ్ల చెరువులో అక్రమంగా మట్టి తవ్విన దృశ్యం

బొమ్మలరామారం: బొమ్మలరామారం మండలంలోని మర్యాల గ్రామంలో గల హనుమాండ్ల చెరువులో నుంచి కొందరు అక్రమార్కులు అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువు నుంచి రాత్రివేళ గుట్టుచప్పుడు కాకుండా మట్టిని తరలించడంతో పాటు ఎఫ్‌టీఎల్ పరిధిలో గల భూములను పొలాలుగా మారుస్తున్నారు. కొందరు నాయకుల అండదండలతో అక్రమ మట్టి రవాణా సాగుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ తతంగంపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు తీసుకున్న చర్యలు శూన్యమని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆందోళనలో మత్స్యకారులు..

హనుమాండ్ల చెరువులో మట్టి తవ్వకాలు జరుగుతుండడంతో స్థానిక మత్స్య కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇష్టానుసారంగా చెరువులో మట్టిని తవ్వడంతో పాటు ఎఫ్‌టీఎల్‌ని పూడ్చివేతతో చెరువు విస్తీర్ణం తగ్గుతుందని వారు వాపోతున్నారు. మట్టి తవ్వకాలతో చెరువులో గోతులు ఏర్పడి నీరు నిలువదంటున్నారు.

అధికారులకు ఫిర్యాదు చేశాం



హన్‌మాండ్ల చెరువులో చేపల పెంపకంపై ఆధారపడిన మత్స్య కార్మికుల ఉపాధికి గండి కొట్టేలా కొంతమంది వ్యక్తులు మట్టి తవ్వడంతో పాటు సమీపంలోని ఎఫ్‌టీఎల్ పరిధి పూడ్చివేస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశాం. – ప్యారారం రాములు, మత్స్య పారిశ్రామిక సహకారం సంఘం అధ్యక్షుడు

విచారణ చేస్తున్నాం



మర్యాల గ్రామంలోని హనుమాండ్ల చెరువులో మట్టి తవ్వకాలపై మత్స్య కార్మిక సంఘం సభ్యులు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ సిబ్బందిని ఘటనా స్థలానికి పంపి విచారణ చేస్తున్నాం. మండలంలో ఎవరు అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాసరావు, తహసీల్దార్

యాదగిరిగుట్టలో భక్తుడు మృతి

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం క్యూలైన్‌లో ఆదివారం ఓ భక్తుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన రామ సాహో(60) ఆదివారం యాదగిరిగుట్టకు వచ్చాడు. దైవ దర్శనానికి క్యూలైన్‌లో వెళ్తుండగా అస్వస్థతకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ఆలయ సిబ్బంది గమనించి ఆయనను కొండపైన ఉన్న ప్రాథమిక చికిత్స కేంద్రానికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ సులభం

- పెద్దవూర మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్

పాడిపంట

పెద్దవూర: వివిధ పంటల్లో తొలి దశలో విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్లు, రసం పీల్చే పురుగులను నియంత్రించడానికి తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని పెద్దవూర మండల వ్యవసాయశాఖ అధికారి పి. సందీప్‌కుమార్ సూచిస్తున్నారు. విత్తన శుద్ధితో మొలక శాతం పెరగడంతో పాటు తొలుత 30 రోజుల వరకు పంట ఆరోగ్యంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వివిధ పంటల సాగులో విత్తన శుద్ధి ఎలా చేయాలో ఆయన వివరించారు.


విత్తనశుద్ధి చేస్తున్న రైతు కూలీలు

- **వరి:** కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండిజమ్ మందును కలిపి 24 గంటల తర్వాత నారు మడిలో చల్లుకోవాలి. దుంప నారు మడులకు అయితే లీటరు నీటికి 1గ్రాము కార్బండిజమ్ మందును కలిపి ఈ ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టాలి. మండె కట్టి మొలకెత్తిన విత్తనాన్ని నారుమడిలో చల్లుకోవాలి.
- **సోయాబీన్:** కిలో విత్తనాలకు 2 గ్రాముల థైరమ్+1 గ్రాము కార్బండిజమ్ కలిపి, 1.5 మిల్లీ లీటర్ల ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్.ఎస్‌తో విత్తన శుద్ధి చేయాలి. చివరగా విత్తే గంట ముందు 10 కిలోల విత్తనాలకు 200 గ్రాముల రైజోబియం జపానీకం కల్చర్‌ను నీరు, జిగురుతో పట్టించి నీడలో ఆరబెట్టాలి.
- **జొన్న:** కిలో విత్తనానికి 3 గ్రాముల థెరమ్ లేదా కాప్టాన్ మందును కలిపి శుద్ధి చేయాలి. మొవ్వ ఈగ నివారణకు కిలో విత్తనానికి 3 గ్రాముల థయోమిథాక్సమ్ మందును కలపాలి.
- **మొక్కజొన్న:** కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్ లేదా థెరమ్ లేదా కాప్టాన్‌తో శుద్ధి చేసుకున్నట్లయితే లేత దశలో మొక్కలను తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవచ్చు.
- **కంది:** కందిలో విత్తనం ద్వారా సంక్రమించే ఎండు తెగులును నివారించడానికి తెగులును తట్టుకునే రకాలను సాగు చేయడంతో పాటు 10 గ్రాముల ట్రైకోడర్మా విరిడే కలిపి శుద్ధి చేసుకోవాలి.
- **మిరప:** మిరప విత్తన శుద్ధి చేయడానికి మొదట విత్తనాలను 15–20 నిమిషాల పాటు గోరు వెచ్చని నీటిలో నానబెట్టాలి. తర్వాత ఒక లీటరు నీటిలో 150 గ్రాముల ట్రైసోడియం ఆర్థోఫాస్ఫేట్‌ను కరిగించి ఆ ద్రావణంలో విత్తనాలను 15–20 నిమిషాల పాటు నానబెట్టాలి.
- **పత్తి:** పత్తిలో రసంపీల్చు పురుగుల తాకిడి ఎక్కువ. బీటీ పత్తిని పండిస్తున్న రైతులు కూడా పిండి నల్లి, నులి పురుగులతో ఇబ్బందులు పడుతున్నారు. వీటి నివారణకు కిలో విత్తనానికి తగినంత జిగురు కలిపి 9 మిల్లీలీటర్ల ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్.ఎస్ లేక 5 గ్రాముల థయోమిథాక్సమ్ 70డబ్ల్యూపీఎస్. 2 గ్రాముల కార్బండిజమ్‌తో విత్తన శుద్ధి చేయాలి.
- **పసుపు:** పసుపు పంటను దుంప వేరు కుళ్లు, ఆకుపచ్చ తెగుళ్ల నుంచి కాపాడుకునేందుకు లీటరు నీటికి 3 గ్రాముల మ్యాంకోజెబ్ లేదా 3 గ్రాముల మెటలాక్సిల్ ఎంజెడ్ కలిపి ఆ ద్రావణంలో 40 నిమిషాల సేపు కొమ్ములను ఉంచాలి. అనంతరం నీడలో ఆరబెట్టాలి. పసుపు కొమ్ము/విత్తనాలకు పొలుసు పురుగు ఆశిస్తే శిలీంద్రనాశినితో పాటు లీటరు నీటికి 5 మిల్లీ లీటర్ల మలాథియాన్, 2 మిల్లీ లీటర్ల మోనోక్రోటోఫాస్ కలిపి నీడలో ఆరబెట్టి నీరు మార్చి 5 గ్రాముల ట్రైకోడెర్మా విరిడే కలిపిన ద్రావణంలో ముంచి కొమ్ములను నీడలో ఆరబెట్టి విత్తుకోవాలి.